శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిమిట్ట వద్ద రోడ్డుపై కుంట



కార్వేటినగరం జీలావారి కండ్రిగ వద్ద రోడ్డుపై గుంతలు



అడుగుకో.. గండం

- అధ్వాన్నమైన రోడ్లతో తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కార్వేటినగరం: అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు కేవలం మాటలు చెప్పితప్పించుకోవడమే కాని, చేతల్లో చూపించే ప్రభుత్వం కాదని 13 నెలలకే అర్థమైందని ప్రజలు అభి ప్రాయపడుతున్నారు. కేవలం పచ్చమీడియా తమ అనుకూల సోషల్ మీడియాల్లో తప్పా పాలన ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు బాహాటంగానే కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. గతేడాదిలో ఉగాది కల్లా మెరిసే రోడ్లు వేస్తామన్నా కూటమి సీఎం చంద్రబాబునాయుడు ఏడాది దాటినా కూడా గుంతలు తేలిన రోడ్లపై తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నియోజకవర్గానికి రెండు పర్యాయాలు వచ్చినా నియోజకవర్గంలో దుస్థితికి చేరుకున్న రోడ్ల ఊసేఎత్తలేదని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లి మిట్ట నుంచి వీవీ పురం వెళ్లె మార్గంలో నిత్యం రద్దీగా ఉంటున్న రోడ్డు దుస్థితికి చేరుకుని కుంటను తలపిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా పాలసముద్రం మండలం రామకృష్ణాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం కంకట తేలి నడకకు నోచుకోవడం లేదని, ద్విచక్రవాహనాల్లో ప్రయాణించిన కుదుపులకు వళ్లు ఊనమవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే రోడ్ల రూపురేఖలు మారిపోతుందని ఊదర కొట్టిన నాయకులు కంటికి కనిపించడంలేని విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసం వస్తే అప్పుడు ఓటు హక్కు యొక్క విలువను చూపిస్తామని మండిపడుతున్నారు. అలాగే వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం అధ్వానంగా మారాయి, కంకరతేలి నడకకు నరయాతన పడుతున్నారు. వాహనాల్లో వెళ్లాలన్నా అవస్థలు తప్పడంలేదు, కూటమి ప్రభుత్వం గ్రామీణ రోడ్లను పట్టించుకోక పోవడం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదే విధంగా కార్వేటి నగరం మండలం కేశవకుప్పం రోడ్డు అడుగడున గుంతలు ఉండటంతో వర్షం పడితే గుంతలయ ఎక్కడ ఉందో తెలియక వాచన చోదకులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. ఇలా ప్రతి మండలంలోనూ గ్రామీణ రోడ్లు ఎక్కడ పడితే అక్కడ దుస్థితికి చేరుకుని ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి.





కంకర తేలిన పాలసముద్రం రామకృష్ణాపురం రోడ్డు, దుస్థితికి చేరుకున్న అగ్నిచేనుపల్లి రోడ్డు

అసత్య వార్తలను నమ్మకండి



మాట్లాడుతున్న శ్యామ్‌రాజ్

శ్రీరంగరాజపురం: నియోజవర్గానికి సంబంధించి కొన్ని పత్రికలు వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి మార్పు అంటూ అసత్య వార్తలను ప్రచారం చేస్తున్నాయని వాటిని నమ్మవద్దని ఆ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్‌రాజ్ అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కొన్ని పత్రికలు ఉద్దేశపూర్వకంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మిపై అసత్య వార్తలను ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ప్రజలను, పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పెరిగాయని తెలిపారు. కక్షతో వికలాంగ పింఛన్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. దివ్యాంగులకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందన్నారు. జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, హరిరెడ్డి, సింహాద్రి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు చోరీ

కార్వేటినగరం: కొల్లాగుంట సమీపంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ వైర్లు చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కొల్లాగుంట గ్రామానికి చెందిన సుబ్రమణ్యం వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ మోటార్‌కు ఏర్పాటు చేసిన 70 మీటర్ల విద్యుత్ వైర్లను, అదేగ్రామానికి చెందిన సుబ్బారెడ్డి పొలం వద్ద మోటార్‌కు ఏర్పాటు చేసిన 100 మీటర్ల విద్యుత్ వైర్లను దుండగులు చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం: స్థానిక ఐటీఐలో ఖాళీగా ఉన్న వివిధ రకాల ట్రేడ్‌లకు సంబంధించి మూడవ విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 27న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 29న ఉదయం 10 గంటలకు ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. కంప్యూటర్, డ్రెస్ మేకింగ్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్, ఫిట్టర్ ట్రేడ్‌లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

అనుమతి తప్పనిసరి

పాలసముద్రం: వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడానికి పోలీసుల అనుమతి తప్పనిసరని ఎస్ఐ చిన్నరెడ్డప్ప అన్నారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ విగ్రహాల వద్ద అశ్లీల నృత్యాలు చేయరాదన్నారు. మండపాలు ఏర్పాటు చేసేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. మద్యం తాగి అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, ఇందుకు ఉత్సవ కమిటీలదే బాధ్యతన్నారు. విగ్రహాల నిమజ్జనం చేసే రోజు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు



గ్రీన్ అంబాసిడర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. గురువారం ఎస్ఆర్ఆర్ కండ్రిగ, వనదుర్గాపురంలో గ్రీన్ అంబాసిడర్ల గ్రామాల్లో పర్యటించి తీసుకొ స్తున్న చెత్తలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. మండల విస్తరణాధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుధ, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

నింద్ర: మండలంలోని డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సంఘమిత్రల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు చిన్న తరహా వ్యాపారాలతో లబ్ధి పొందవచ్చునని అన్నారు. శ్రీనిధి బ్యాంక్ లింకేజీ, ఉమెన్ లీడ్ తదితర సంస్థల ద్వారా రుణాలు పొందిన మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన వారు సక్రమంగా చెల్లించే విధంగా వీఓలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ, డీపీఎంలు సనీత, హేమమధుసూదన్, సుబ్బారెడ్డి, ఏపీఎం పళణి, సీసీలు భాస్కర్, గిరి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం

కార్వేటినగరం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఉచిత వైద్యశిబిరం లక్ష్యమని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురం ఎస్టీ కాలనీలో కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యాధికారులు అందించే వైద్య సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు.డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సర్పంచ్ చిన్ని, పర్యవేక్షకులు త్యాగు, చంద్రవల్లి, ఎంఎల్‌హెచ్‌పీ జోత్స్న, పవిత్ర, రేఖ, హెల్త్ అసిస్టెంట్ రామ్మోహన్, ఏఎన్ఎం స్వర్ణ, మునేశ్వరీ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విష్ణుప్రియ

విజయపురం: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విష్ణుప్రియ పేర్కొన్నారు. గురువారం విజయపురం మండలం శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్నానం చేయాలన్నారు. హెచ్ఎం వెంకమరాజు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను మానుకోండి

- జగనన్నను సీఎం చేసే వరకు నిద్రపోను
- జగనన్న వెంటే కళత్తూరు కుటుంబం
- సమన్వయకర్త కృపాలక్ష్మి



మాట్లాడుతున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: కళత్తూరు కుటుంబం రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొన్ని పచ్చ పత్రికలు దుష్ప్రచారాలు చేస్తున్నాయని, అలాంటి వాటికి స్వస్తి చెప్పి వాస్తవాలను రాయాలని వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గం సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. గురువారం పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులు ఉన్నంత వరకూ నియోజకవర్గం సమన్వయకర్తగా తానే వ్యవహరిస్తానని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొన్ని పత్రికలు అసత్య వార్తలు రాస్తున్నారని అది మంచిది కాదని చురకలు అంటించారు. తుది శ్వాస ఉన్నంత వరకు కళత్తూరు కుటుంబం జగనన్న వెంటే ఉంటుందని, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు బహుమతిగా అందిస్తానని అన్నారు. పార్టీని విజయపథంలో నడిపి జగనన్నను ముఖ్యమంత్రిని చేసేంతవరకు నిద్రపోనని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. 2029 ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుని, మళ్లీ సంక్షేమ పాలనను సాధించుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఏకైక వ్యక్తి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అని అన్నారు. అలాంటి కుటుంబంపై కొన్ని పత్రికలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసత్య వార్తలు వండి వారుస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. తండ్రి బాటలో నడుస్తూ అదే అభివృద్ధికి శ్రీకారం చుట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు.

రోగులతో స్నేహభావంతో మెలగాలి



మందులను పరిశీలిస్తున్న వెంకటరమణ

పాలసముద్రం: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న రోగల పట్ల స్నేహభావంతో మెలగాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ తెలిపారు. గురువారం పాలసముద్రం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌పీలో ఇస్తున్న మందులను పరిశీలించారు. వైద్యాధికారులు మోహన్‌క్రిష్ణ, జయకుమార్, సీహెచ్ఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా చేయాలి

పాలసముద్రం: మండలంలో జరుగుతున్న రీసర్వేను విలేజ్ సర్వేయర్, వీఆర్వోలు పారదర్శకంగా చేయాలని నగరి డివిజన్ ఆర్డీఓ అనుపమ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణ కుమారి, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ అనుపమ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రవేశపెట్టిన సుమోటో ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్ సర్టిఫికెట్లు 3,215 ఉన్నాయన్నారు. వాటి డాక్యుమెంట్లు సేకరించి వీఆర్వో లాగిన్ నుంచి ఫార్వర్డ్ చేసి తహసీల్దార్ లాగిన్‌లో పూర్తి చేయాల్సిన బాధ్యత మీపై ఉందని తెలిపారు. రీసర్వే చేస్తున్నప్పుడు రైతు భూమి వద్దకు వెళ్లి రికార్డులను పరిశీలించిన తరువాతనే ఆన్‌లైన్ చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రిశి వర్మ, అశోక్‌కుమార్, డీఏ రవి, ఎంఆర్ఐ దేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ అనుపమ

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి



సీఐ విక్రమ్

నగరి: మున్సిపల్, మండల పరిధిలో వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక ప్రతిమలు ఏర్పాటు చేయదలచిన వారు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని సీఐ విక్రమ్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను తెలియజేశారు. ఎవరైతే వినాయక చవితి నిర్వహిస్తారో వారు ఆన్‌లైన్‌లో గణేశ్ ఉత్సవ్ యాప్‌లో తగు వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించిన తర్వాత అనుమతి ఇస్తామన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

నింద్రలో..



సీఐ భాస్కర్

నింద్ర: మండలంలో వినాయక చవతి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నగరి రూరల్ సీఐ భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరి రూరల్ పరిధిలోని నింద్ర, విజయపురం మండలాల్లోని గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, అనుమతులు పొందాలన్నారు. డీజే మ్యూజిక్ ఏర్పాటు చేయరాదన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి



హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

కార్వేటినగరం: హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప అన్నారు. గురువారం డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ యూనిట్‌తో కలిసి గ్రామ వీధుల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత హెల్మెట్‌ను ఫ్యాషన్‌గా కాకుండా రోడ్డు భద్రతలో భాగంగా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ డాక్టర్ విజయులు రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ధనుంజయరెడ్డి, అధ్యాపకులు సుబ్బారావు, రఘురాం, లత, జోగిప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట

నగరి: వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన సరస్వతీ దేవి విగ్రహాన్ని గురువారం వైభవంగా ప్రతిష్టించారు. ఈ పాఠశాలలో చదివి ఎందరో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కొంత కాలం క్రితం పాఠశాలలో సమావేశమైన ఉపాధ్యాయులు, విద్యార్థుల నడుమ సరస్వతి విగ్రహం ఏర్పాటు చేయాలన్న అంశం చర్చకు వచ్చింది. దీంతో విగ్రహ ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభం కాగా పలువురు దాతలు ముందుకు వచ్చారు. ధనలక్ష్మి, రామకృష్ణ అనే దాతలు విగ్రహాన్ని అందించగా, పాలేగారు శాంతి, గోపి వేదిక నిర్మాణానికి దాతలుగా వ్యవహరించారు. కొల్లు వెంకటేశులు శెట్టి, ఢిల్లీబాబు శెట్టి పూజా సామగ్రిని అందజేశారు. పీడీ సురేష్‌బాబు దాతలందరినీ సమన్వయ పరచడం, ప్రదానోపాధ్యాయిని కె.శ్యామల అనుమతులకు సంబంధిత వ్యవహారాలు చూసుకోవడంతో సరస్వతి దేవి విగ్రహ రూపంలో పాఠశాలలో కొలువుదీరింది. విగ్రహ ప్రతిష్ట, హోమ పూజలు, కుంభాభిషేకం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు డీసీసీ కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీ లక్ష్మి, రిటైర్డ్ డీవైఈఓ ప్రభాకర్ రాజు, పారిశ్రామికవేత్త సరస్వతి రాజగోపాల్ రాజు, రిటైర్డ్ ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో కొలువుదీరిన సరస్వతి దేవి, పూజలకు హాజరైన దాతలు, ఉపాధ్యాయులు

హెల్మెట్ కుటుంబానికి రక్ష

నగరి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వారి జీవితానికే కాదు కుటుంబానికి కూడా రక్షణ అని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా నియమాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓంశక్తి ఆలయ బైపాస్ సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ మీదుగా ఏకాంబరకుప్పం వరకు హెల్మెట్లు ధరించి పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటుచేసి హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ఏర్పరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు, రవాణా శాఖ అధికారులు జరిమానా విధిస్తున్నారనే భయంతో కాకుండా స్వీయ రక్షణకు వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. రహదారి భద్రత కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. సీఐ విక్రమ్, ఎస్ఐలు విజయ్‌నాయక్, తేజస్విని పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ, పోలీసులు

నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

పుత్తూరు: దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన 15వ రోజుకు చేరింది. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుపతి జిల్లా జీసీజీటీఏ అధ్యక్షుడు టి.నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 42ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం రీడెజిగ్నేషన్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 29న విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాలో పెద్ద ఎత్తున అధ్యాపకులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సుజన, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య, అధ్యాపకులు సాంసన్‌రాజు, సరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన

గిరిజన కాలనీలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

నింద్ర: మండలంలోని నేట్టేరి ఎస్టీకాలనీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఎల్‌డీఓ ఇందిరమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి హనుమంతరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేస్తామన్నారు. మొత్తం 61 మందికి వైద్య పరీక్షలు చేశారు. తహశీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ, వైద్యాధికారి వినీషా, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి గోపి, సీహెచ్ఓ శ్రీదేవి పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఎస్టీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ విష్ణుప్రియ ఉచిత శిబిరంలో 15 మందికి రక్త పరీక్షలు చేశారు. వైద్య పరీక్ష అనంతరం మందులు, మాత్రలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్న లక్ష్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రీబస్సు ఆపాలని ఆందోళన



తడుకు వద్ద మహిళల ఆందోళన

పుత్తూరు: మండల పరిధిలోని తడుకు గ్రామం వద్ద ఉచిత బస్సులను ఆపాలంటూ మహిళలు ఆందోళనకు దిగారు. గురువారం ఉదయం వివిధ పనులపై బయల్దేరిన మహిళలు తడుకు బస్టాండు వద్ద స్త్రీశక్తి బస్సు కోసం ఎదురు చూస్తూ నిల్చొన్నారు. పుత్తూరు నుంచి అక్కడికి వచ్చిన 0216 నెంబరు గల ఆర్టీసీ బస్సు మహిళలను చూసి, ఆపకుండా వెళ్లిపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీశక్తి పేరిట ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్లు ప్రకటించిందని, అయితే బస్సు డ్రైవర్లు చూసీచూడనట్లు వెళ్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ యాజమాన్యం తక్షణం ఇలాంటి సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

నల్ల బ్యాడ్జీలతో ఆందోళన

-వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్ల డిమాండ్

కార్వేటినగరం: కేంద్ర ప్రభుత్వం వేతనాలను వెంటనే పెంచాలని అంగన్‌వాడీ వర్కర్లు మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచడంలోజాప్యం చేస్తోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు పనిభారాన్ని పెంచి తగిన వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా జూలై, 2024లో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, అయినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదన్నారు. సరుకులు ఇవ్వడానికి పెట్టిన నిబంధన అమలు చేయడానికి అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ జీఓలో మార్పులు చేయాలన్నారు. డిమాండ్‌లను పరిష్కరించడానికి యూనియన్‌తో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్ష

నగరి: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గురువారం సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి పెరుమాళ్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు చేరుకున్న వారు అక్కడే రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకురాలు ధనకోటి మాట్లాడుతూ తమకు గౌరవ వేతనం వద్దని కనీస వేతనం కావాలన్నారు. ప్రస్తుతం ఇచ్చిన మొబైల్‌ను తీసుకుని 5జీ కలిగిన మొబైల్ అందించాలన్నారు. రెండు యాప్‌ల విధానాన్ని రద్దు చేసి ఒకే యాప్‌గా మార్చాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నేతలు సుజాత, లత, శివగామి తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు